
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 18 జూన్ 2025



బీసీ బిల్లు కోసం
**జూలై 17న రైల్ రోకో**
- 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత 7

## ప్రజెంట్ సార్..



సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొన్ని రామచిలుకలు గూడు ఏర్పాటు చేసుకున్నాయి. చిలుకల కిలకిల రావాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. చిలుకల కోలాహలాన్ని చూసిన విద్యార్థులు తమ కన్నా ముందుగానే రామచిలుకలు అడ్మిషన్ పొందాయని సరదాగా చర్చించుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట





# రైతుకేది సహకారం!




- డీసీసీబీ బ్యాంకుల్లో పేరుకుపోయిన బకాయిలు
- బీ కేటగిరి సొసైటీలకు రూ.50 లక్షలు
- సీ కేటగిరి సొసైటీలకు కేవలం రూ.25లక్షలు
- రుణమాఫీ ఆశలో అప్పుల కుప్ప
- సకాలంలో రెన్యూవల్ లేక అవస్థలు
- పెట్టుబడి సహాయం అందక రైతన్నల ఆందోళన

**వర్షాకాలం సాగుకు పెట్టుబడులు లేక రైతులకు అవస్థలు తప్పడం లేదు. రైతులకు సహకారం అందించాల్సిన వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల్లో చాలా వరకు బకాయిలు పేరుకుపోవడంతో ఈసారి రుణాలను అత్తెసరుగా కేటాయించారు. ఇప్పటి వరకు కేటాయింపు వివరాలనూ బ్యాంకులకు అందించిన దాఖలాలు కూడా లేవు. జిల్లాలోని పాత వరంగల్ జిల్లాలోని రెండు, పాత కరీంనగర్ జిల్లాలోని నాలుగు సొసైటీలు మినహా మిగిలిన 21 సొసైటీల్లో ఏ సొసైటీ కూడా ఏ కేటగిరిలో అర్హత పొందడం లేదు. సహకార సంఘాలు సకాలంలో రుణాలను అందించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.**

- దుబ్బాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం మూడు కేటగిరిలుగా విభజించి, రికవరీల శాతంలోని కొంత భాగం పరిగణలోకి తీసుకుని రుణాలు కేటాయింపులు చేశారు. జిల్లాలోని 6 సొసైటీలకు బీ కేటగిరి కింద రూ.50 లక్షల చొప్పున, మిగిలిన 21 సొసైటీల్లో సీ కేటగిరి కింద రూ. 25లక్షలును కేటాయిస్తున్నట్లు సోమవారం సూత్రప్రాయంగా ఆదేశాలు అందాయి. జిల్లాలో 87,197 మంది సభ్యులున్నా ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా రుణసాయం అందలేదు. గత డిసెంబరు నుంచి ఒక్క పంట రుణాన్నీ అందించిన దాఖలాలు లేవు.

### రూ.180 కోట్ల బకాయిలు

నా బార్డు నిబంధనల ప్రకారం డీసీసీబీ గతేడాది ఉమ్మడి జిల్లాకు రూ.70 కోట్ల రుణాలను అందించింది. ప్రస్తుతం కూడా రూ.40 కోట్లను ఉమ్మడి జిల్లాకు కేటాయిస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని సుమారు 21 సొసైటీలు పూర్తిగా రికవరీలు లేక అవస్థలు పడుతున్నాయి. ఇందులో కొన్గల్, దుబ్బాక, నంగునూర్, పాలమాకుల, గజ్వేల్, సిద్దిపేట, అల్లీపూర్, చిన్నకోడూర్(గంగాపూర్), ములుగుతోపాటు మరికొన్ని సొసైటీలు పూర్తిగా బకాయిల రికవరీలో వెనకబడి ఉన్నాయి. వీటిని సీ కేటగిరి కింద తీసుకున్నారు. తొగుట మండలం కొన్గల్ సొసైటీతోపాటు ములుగు సొసైటీలు పూర్తిగా అర్హత కోల్పోయాయి. తొగుట మండలం మల్లన్నసాగర్ నిర్మాణంతో భూనిర్వాసితులు, ములుగు సొసైటీకి కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితులు తమ రుణాలను చెల్లించకపోవడంతో ఆయా సొసైటీల్లో రికవరీ శాతం తగ్గింది. జిల్లాలోని మిగితా సొసైటీలో కూడా రుణాల చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో సకాలంలో సహకార సంఘాలు రుణాలను అందించలేక పోతున్నాయి. వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, మిరుదొడ్డి. మిట్టపల్లి, దౌల్తాబాద్ సొసైటీలు రికవరీల్లో కొంత మెరుగ్గా ఉన్నాయి. దీంతో వాటికి రూ.50 లక్షల చొప్పున కేటాయింపులు చేశారు. డీసీసీబీ ద్వారా కేటాయించిన ఈ నిధులు కూడా 10 శాతం రైతులకు కూడా సరిపడవనే చెప్పాలి. దీంతో కొత్తరుణాలకు కూడా మోక్షం లభించే అవకాశం లేదు.

### రికవరీకి అడ్డుగా రుణమాఫీ ఆశలు

ప్రభుత్వాలు ప్రతిసారి రుణమాఫీ ప్రకటనలు చేయడంతో బ్యాంకుల్లో రికవరీలు సక్రమంగా సాగడంలేదు. రుణమాఫీ జరుగుతుందనే ఆశతో రికవరి, రెన్యూవల్ లేకపోవడంతో బకాయిలు అలాగే మిగిలిపోతున్నాయి. కొన్ని సొసైటీల్లో పూర్తిగా రుణమాఫీ కాలేదు. దుబ్బాక, మిరుదొడ్డితో పాటు ములుగు తదితర సొసైటీల్లో సాంకేతిక కారణాలతో రుణమాఫీలు కాలేదు. మరికొన్ని చోట్ల సొసైటీ సిబ్బంది తప్పుల వల్ల కూడా రుణమాఫీ కాలేదు.

### ఈసారి సొసైటీలకు అందని ఎరువులు

గత ఏడాది ములుగు, సిద్దిపేట సొసైటీలు మినహా అన్ని సొసైటీలకు డీఏపీ, కాంప్లెక్స్‌ను సరఫరా చేసిన మార్క్‌ఫెడ్ ఈసారి మాత్రం ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. తొగుట మండలం కొన్గల్‌లో 25 టన్నుల యూరియా, కోహెడ సొసైటీకి 25.2 టన్నులు, హుస్నాబాద్, అక్కన్నపేట సొసైటీలకు అందించినా కూడా జిల్లాలోని అన్ని సొసైటీల్లో ఎరువులు తీసుకోలేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 28,680 మెట్రిక్ టన్నుల యూరియా అందించారు.

మిగతా 8వ పేజీలో




జిల్లాలో వానాకాలం సాగు పనులు జోరందుకున్నాయి. రోహిణి కార్తెలోనే వర్షాలు కురవడంతో రైతులు ముందస్తుగానే పంటల సాగుకు సమాయత్తమయ్యారు. జగదేవ్‌పూర్ ప్రాంతంలో పత్తి సాగు జోరుగా సాగుతుంది. - జగదేవ్‌పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి)



చిన్నకోడూరు శివారులో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

## విద్యుత్ వైర్లకు అదనపు పోల్స్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు/వర్గల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ఈనెల 17న ప్రచురితమైన "యమపాశాలు.." ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు కథనానికి అధికారులు స్పందించారు. సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ సమీపంలోని రైతు ధర్మయ్య పొలం వద్ద చేతికందేలా వదులుగా ఉన్న వైర్లకు అదనపు పోల్స్ బిగించి సమస్యను పరిష్కరించారు. చిన్నకోడూరు శివారులోని ఓ రైతు పొలంలో చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి మంటలు వస్తుండడంతో అధికారులు కొమ్మలను తొలగించారు. అలాగే వర్గల్ మండలం సింగాయపల్లిలో విద్యుత్ తీగలకు సమీపంలో పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి సమస్యను పరిష్కరించిన విద్యుత్‌శాఖ అధికారులకు, వార్తను ప్రచురించి సమస్య పరిష్కారానికి మార్గం చూపిన ఆంధ్రజ్యోతికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లో వదులుగా ఉన్న విద్యుత్ వైర్లకు అదనపు పోల్స్ ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## బాలిక ప్రాణం తీసిన ఫొటో సరదా

- అపస్మారక స్థితిలోకి మరో బాలిక



అపస్మారకస్థితికి చేరుకున్న నిత్య



నవ్య (ఫైల్)

చేర్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చెరువులో నీరు చూసి.. అక్కడ ఫొటో దిగేందుకు వెళ్లిన ఓ బాలిక నీటిలో మునిగి చనిపోగా, మరో బాలిక అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండం భగవాన్‌రెడ్డి-భవానీ దంపతులు చాన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి నవ్య(12), హర్షవర్ధన్, రుత్విక సంతానం. స్వగ్రామం పక్కనే గల నంగునూరు మండలం దేవుని నర్మెట్టలోని గురుకుల హాస్టల్‌లో నవ్య, హర్షవర్ధన్‌లను చేర్పించేందుకు సోమవారం సాయంత్రం భవానీ పిల్లలతో కలిసి ఊరికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తోటికోడలు కొండం నిత్యతో పాటు పిల్లలతో కలిసి తమ బంధువుల వ్యవసాయబావి బావి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా, మార్గంమధ్యలో గల చెరువులో నీటిని చూసి పిల్లలు సరదాగా ఫొటోలు దిగుదామని అడిగారు. నిత్య, నవ్య, అక్షర, రిత్విక చెరువు లోపలికి వెళ్లగా, భవానీ హర్షవర్ధన్ గట్టు మీద ఉన్నారు. చెరువులోకి దిగిన నిత్య, నవ్య ప్రమాదకరంగా ఉన్న జేసీబీ గుంతలో పడి మునిగిపోయారు. గట్టు మీద ఉన్న వారి కేకలు విన్న స్థానికులు అక్కడి చేరుకుని నిత్య, నవ్యను బయటకు లాగారు. అప్పటికే నవ్య చనిపోయింది. నిత్య అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీరేష్ తెలిపారు.

## యువతీ యువకుల ఆత్మహత్య

- వేర్వేరు చోట్ల ఉరి వేసుకుని..
- ప్రేమ వ్యవహారమే కారణం !



శివకుమార్(ఫైల్)



కల్పన (ఫైల్)

వర్గల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిదీ ఒకే గ్రామం, ఒకే కులం, ఇద్దరు ప్రేమించుకున్నారు. పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో ఒకరి తర్వాత ఒకరు గంట వ్యవధిలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, గౌరారం ఎస్సై కరుణకర్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి మల్లేష్, మంజుల దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు శివకుమార్ ఉన్నారు. ఇంటర్ వరకు చదివిన శివకుమార్ వ్యవసాయం చేస్తున్నాడు. అదే గ్రామానికి చిందిన చెక్కల ఆంజనేయులు, కనకవ్వకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కల్పన ఉన్నారు. కల్పన కూడా ఇంటర్ వరకు చదివి ఇంటి వద్ద టైలరింగ్ పనులను చేస్తోంది. ఇద్దరి మధ్య కొన్ని రోజులుగా ప్రేమ వ్యవహారం ఉన్నట్లు ఇరు కుటుంబాలు గ్రహించి వారి ప్రేమను పెద్దలు తిరస్కరించారు. కల్పనకు ఇటీవల మేనరికం సంబంధం కుదరడంతో ఆవేదన చెందిన శివకుమార్ మంగళవారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ విషయం తెలిసి కల్పన గంట వ్యవధిలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరి మధ్యన ప్రేమ వ్యవహారం ఉండటంతో ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడి ఉంటారని ఇరు కుటుంబాలు భావిస్తున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికే భూభారతి

- కలెక్టర్ హైమావతి

కొండపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ హైమావతి అన్నారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రకియను పరిశీలించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు పెట్టుకునే ప్రతీ అర్జీని, ఆ అర్జీకి సంబంధించిన భూ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో క్షుణ్ణం గా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి తదితర భూముల పూర్తి వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దార్ శ్యామ్‌ను ఆదేశించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం కొండపాక మండలం బందారంలోని రైతు నర్రా జైపాల్‌రెడ్డి క్షేత్రంలో 10 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. కలెక్టర్ మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు శాఖ అధికారి సువర్ణ, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, కొండపాక డివిజన్ వ్యవసాయ అధికారి బాబు, మండల ఉద్యాన అధికారి కౌసల్య, మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ, ఉద్యాన శాఖ అధికారులు, పలువురు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపల్లిలో దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్

అర్హత టెన్త్..
**ఉపాధి మస్త్..**
- ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు)తో ఉద్యోగావకాశాలు
- కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ప్రారంభం
- అందుబాటులో ఆరు కోర్సులు.. ఉచిత అడ్మిషన్లు 7

**పట్టుబట్టింది.. సాధించింది**
- ఇంటర్ సప్లిమెంటరీలో స్టేట్ రెండో ర్యాంకు 7

ఫ్రెండ్లీ పోలీస్‌కు కేరాఫ్‌గా
**జిల్లా పోలీసులు** 8

## చేర్యాల ఆసుపత్రికి గ్రహణం

- పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని భవనం
- అధునాతన వసతులతో నిర్మాణం
- నిధుల లేమితో పెండింగ్‌లో పనులు

చేర్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన ప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రూ.కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన వసతుల కల్పనతో నిర్మించినప్పటికీ ప్రజాప్రతినిధులు, వైద్యశాఖ ఉన్నతాధికారుల పట్టింపులేని తనంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. చాలా ఏళ్ల క్రితమే భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ కేవలం అందుబాటులోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో పాతభవనంలో అరకొర వసతుల నడుమ వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు నిలిచి కనీస వైద్యసేవలు సక్రమంగా అందని క్రమంలో గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆస్పత్రి దుస్థితిని పరిశీలించారు. 30 పడకల ఆస్పత్రి భవన నూతన నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్ వైద్యఅవసరాల దృష్ట్యా భవన నిర్మాణానికి రూ.8.70కోట్లు మంజూరు చేయించారు. తద్వారా స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలోని స్థలాన్ని కేటాయించడంతో పనులు చకచకా కార్యరూపం దాల్చాయి. అధునాతన వసతులతో భవనాన్ని నిర్మించారు.

### ప్రభుత్వం మారినా...

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం మారడంతో మధ్యలోనే నిలిచిపోయింది. ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకున్నాథుడే లేకపోవడంతో కోట్లు వెచ్చించి నిర్మించినా అవసరానికి ఉప యోగపడని పరిస్థితి దాపురించింది. ఈవిషయమై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కూడా భవనాన్ని పరిశీలించి త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ నెలలు గడిచినా ఎలాంటి ప్రయోజనం కానరాకపోవడంతో ఎన్నటికి ప్రారంభిస్తారా అని ఎదురుచూస్తున్నారు.

భవనం నిర్మాణ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ.2కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. భవనం అప్పగింతకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా వైద్యాధికారులు మరిన్ని పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.



పూర్తయిన చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనం

## పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు

●మనస్థాపంతో భర్త ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

నిజాంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గొడవలతో తరచూ భార్యా పిల్లలు పుట్టింటికి వెళ్తుండడంతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నిజాంపేట మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్వకుంట్ల గ్రామానికి చెందిన వల్లకాటి శ్రీనివాస్(51) కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. అనారోగ్యం వల్ల తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో మంగళవారం పిల్లలతో సహా భార్య సరిత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాస్ మానసికంగా కృంగిపోయి మనస్థాపం చెంది తన ఇంట్లోనే మధ్యాహ్నం తలుపులు వేసుకొని దూలానికి ఉరివేసుకున్నాడు. శ్రీనివాస్ తమ్ముడు వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

# ఇది.. సన్న బియ్యం క్యూ..


రామాయంపేటలోని ఓ డీలర్ షాపు వద్ద వరుసగా ఉంచిన ఖాళీ బస్తాలు

రామాయంపేట , జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల ఉచిత సన్న బియ్యం సరఫరా డీలర్లను ముచ్చెమటలు పట్టిస్తోంది. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నా.. అధికారుల ఆదేశాలు అందక అవస్థలు పడాల్సి వస్తుంది. అంతేకాదు లబ్ధిదారులు బియ్యం కోసం చెప్పులరిగేలా షాపుల చుట్టూ తిరుగుతూ తిట్టి పోస్తున్నారు. మంగళవారం వేకువజామునే లబ్ధిదారులు రామయంపేటలోని రేషన్ దుకాణాల వద్ద వరుసలో ఖాళీ సంచులు పెట్టి వెళ్లారు. పొద్దంతా క్యూలో నిలబడలేక రెండు రోజులుగా ఇలాంటి పరిస్థితి పట్టణంలో కనిపిస్తోంది. స్టాక్ ఉన్నప్పటికీ సివిల్ సప్లై గోదాంలో డీలర్లు వేలిముద్రలు వేయలేదు. దీని వల్ల బియ్యం తీసుకుని వారి థంబ్ కూడా మిషన్లో పడదు. అందువల్ల ప్రస్తుతం బియ్యం పంపిణీ చేయలేని దుస్థితి ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో 9 షాపులు ఉండగా.. అంతట స్టాకు వచ్చింది. మరికొన్ని చోట్ల స్టాక్ రాకపోవడంతో తహసీల్దార్ పట్టణంలోనూ సరఫరా నిలపాలని డీలర్లను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## ఘనంగా గ్రామదేవతల జాతర


మల్కాపూర్ గ్రామదేవత జాతరలో భవిష్యవాణి

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గ్రామదేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బొడ్రాయికి జలాభిషేకం, ఊరడమ్మ, మహంకాళి అమ్మవార్లకు బోనాల సమర్పణ, పోతరాజుల, గావు రంగాలు, శివసత్తుల పూనకాలతో ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహదేవీ నవీన్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కోతులదాడిలో చిన్నారికి గాయాలు

నారాయణఖేడ్,జూన్ 17(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో మంగళవారం ఓ చిన్నారిపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. పట్టణంలోని కోర్టు కాలనీ సమీపంలో నివాసముంటున్న రాజిరెడ్డి కుమార్తె (4) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో ఆ చిన్నారిపై కోతులు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబసభ్యులు ఆ చిన్నారిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారి ఎడమచేతికి గాయాలు అయ్యాయి.

# ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ ముఖ్యం


జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని ఆర్మడ్ రిజర్వ్, హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వారి సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన చేసే పనులను బట్టి మన విలువ పెరుగుతోందన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ప్రతి శుక్రవారం కార్యాలయానికి వచ్చి కలవాలన్నారు. చిన్న, చిన్న పొరపాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. వ్యక్తిగతంగా, డిపార్ట్‌మెంట్ పరంగా క్రమశిక్షణ చాలా ముఖ్యమని, చెప్పకుండా విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. ప్రతి హోంగార్డు సిబ్బంది లైఫ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లావేళలా కృషి చేస్తామన్నారు. పోలీసు శాఖలో పని చేస్తూ.. నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐలు, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలి

హవేళిఘణపూర్, జూన్ 17;(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగాలని, గ్రామాల్లో చోరీలు జరగకుండా ఉండేందుకు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రజలు పల్లెల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు పొలాల వద్ద గొడవలు పెట్టుకోవద్దని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## వ్యవసాయశాఖ వల్ల రైతు భరోసా నష్టపోయా..

శివ్వంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బంధు కోల్పోయినని మండలంలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన రైతు హనుమంతు రవి ఎకరా 20 గుంటల వరి సాగు చేశాడు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఫీల్డ్ సర్వే వెళ్లకుండా ఈ భూమిలో వరి సాగులో లేనట్టుగా నమోదు చేశారని ఏఈవో నిర్లక్ష్యానికి రైతు భరోసా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని రైతు హనుమంతు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో లావణ్యను సంప్రదించగా రైతు పంట సాగు అప్డేట్ చేసుకోకపోవడంతో రైతు భరోసా నష్టపోయారని తెలిపారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీ చంద్ర మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం, జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన మంగలి బాబు (26) మద్యానికి బానిసై అదే గ్రామానికి చెందిన రాములమ్మను నానా రకాలుగా దూషించేవాడు. 2021 నవంబరు 19న ఈ విషయంలో రాములమ్మ కొడుకైన భాస్కర్, మంగలి బాబుల మధ్య గొడవ జరిగింది. దీంతో భాస్కర్.. బాబును మందు సీసాతో గొంతుపై, కడుపులో పొడిచి హత్య చేశాడు. ఈ మేరకు బొల్లారం పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు రావడంతో నిందితుడు మంగలి భాస్కర్‌కు జీవిత ఖైదు శిక్ష , రూ.500 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులు ప్రశాంత్, రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, అశోక్, రాజశేఖర్, కె.సత్యనారాయణలను జిల్లా ఎస్పీ పంకజ్ అభినందించారు.

## అదుపుతప్పి బోల్తాపడ్డ ట్రాక్టర్..

● రైతుకు తప్పిన ప్రాణాపాయం


బోల్తా పడ్డ ట్రాక్టర్

శివ్వంపేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఓ రైతుకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శివ్వంటలో మంగళవారం జరిగింది.. బాధిత రైతు స్థానికులు తెలిపే వివరాలు మేరకు మండల కేంద్రానికి చెందిన శ్రీను రైతు తమ ట్రాక్టర్ కల్టివేటర్‌తో మడుగు పొలంలో దున్నేందుకు బురద బాట రోడ్డున వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కింద పొలంలో బోల్తా పడటంతో రైతు మల్లేష్ డ్రైవింగ్ సీట్‌లో ఇరుక్కోగా వెంటనే స్థానికులు జేసీపీ సహాయంతో వెలికితీశారు. తలకు చేయికి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో బాధిత రైతుకు ప్రాణాపాయం తప్పింది.

## 'రైతుపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి'

నిజాంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : దళిత రైతుపై దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన రైతు గాజులపల్లి స్వామిపై ఇటీవల దాడిచేయగా మంగళవారం స్వామిని కలిసి వివరాలు సేకరించారు. తిప్పనగుళ్ల గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 163, 164లో 3 ఎకరాల 30 గుంటల భూమిని 40 సంవత్సరాల క్రితం బీసీ వర్గానికి చెందిన ఇద్దరు రైతుల వద్ద కొనుగోలు చేయగా.. నాటి నుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఈ భూమికి సంబంధించిన పట్టా సైతం ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఏడాది నుంచి సహదేవ్ అనే రైతు బెదిరింపులకు పాల్పడుతూ.. ఇటీవల దాడి చేశారన్నారు. వెంటనే అతడిని అరెస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, గిరిజన నాయకుడు వినోద్ బాధితుడు స్వామి, దళితులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

కుకునూరుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామానికి చెందిన చిరబోయిన ప్రదీప్(25) ఈ నెల 4న బైక్‌పై వస్తుండగా చిన్నకిష్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో ప్రదీప్‌కు తీవ్రమైన గాయాలు అయ్యాయి. మరో యువకుడు స్వల్పంగా గాయపడగా, తీవ్రంగా గాయపడిన ప్రదీప్‌ను ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రిలో చేర్చి అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఆస్పత్రిలో ప్రదీప్ మృతి చెందాడు.

## ఆకలితో అలమటించి వ్యక్తి..


అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

గజ్వేల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పొట్టచేత పట్టుకొని బతకడానికి వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, గ్రామ యువకులు, పంచాయతీ సిబ్బంది, దాతల సహకారంతో అంత్యక్రియలు చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి 18 ఏళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన స్వామి(55) గ్రామంలో ప్రైవేట్ కంపెనీకి పెయింటింగ్ వర్క్ కోసం ఇక్కడే ఉండిపోయాడు. చిన్నచిన్న పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం కొసాగించాడు. సంవత్సరం నుంచి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామ ప్రజల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి నా అనేవారు ఎవరూ లేరు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

సిద్దిపేట క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన బోయిని బాలయ్య (58) పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రైతు బజార్ నుంచి కూరగాయలు తీసుకొని వెళ్తుండగా ముస్తాబాద్ చౌరస్తాలో లారీ ఢీ కొట్టింది. దీంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామ విధించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సబ్ స్టేషన్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు

పాపన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు అయినట్లు ఎస్ఈ శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 125 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా, వాటి అభివృద్ధికి నిధులు వినియోగిస్తామన్నారు. జిల్లాలో గృహ, పరిశ్రమల ఉంచి నెలకు రూ. 97 కోట్ల ఆదాయం వస్తుందని, 90 శాతం బిల్లులు సకాలంలో వసూలవుతున్నాయన్నారు. వినియోగదారులు పూర్తి బిల్లులు కడితేనే మెరుగైన సేవలు అందించగలుగుతామన్నారు.

### రూ.12.34 లక్షలు మంజూరు

మండల పరిధి కొడుపాక విద్యుత్ ఉపకేంద్రం ప్రహరీ, ఇతర మరమ్మతుల కోసం రూ.12.34 లక్షలు మంజూరైనట్లు విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో సమస్యలు ఉండగా, సీఎండీ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.

### వెంకటాయపల్లికి సబ్ స్టేషన్

తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. వెంకటాయపల్లి శివారులోని సర్వే 61లో ఇందు కోసం 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. వెంకటాయపల్లిలో రూ. 2.78 కోట్ల వ్యయంతో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రదేశాన్ని మంగళవారం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) సుకుమార్ పరిశీలించారు. బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ ఫరీద్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు లంబ రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అయ్యో.. అమ్మకెంత కష్టం

## తూప్రాన్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌ల కొరత

- ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్న సిబ్బంది
- మూడో వంతుకు పడిపోయిన ప్రసవాల సంఖ్య

తూప్రాన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే పెద్ద ఆసుపత్రిగా మారింది. గైనకాలజిస్ట్ కొరతతో కాబోయే తల్లులు తీవ్ర ప్రసవ వేదనను ఎదుర్కొంటున్నారు. గతంలో నెలకు వంద వరకు ప్రసవాలు జరిగే ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం వాటి సంఖ్య మూడో వంతుకు పడిపోయింది. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో రోగుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.


తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి

**ఆసుపత్రిలో సిబ్బంది కొరత**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో రూ.11కోట్లతో తూప్రాన్ పట్టణంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2018 జనవరి 17న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ దీనిని ప్రారంభించారు. కొంత కాలానికి తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి 52 పోస్టులు మంజూరయ్యాయి, అందులో 23 వైద్యుల పోస్టులు ఉన్నాయి. అయితే, ఈ పోస్టులలో పూర్తిస్థాయిలో నియామకాలు జరగకపోవడంతో ఆసుపత్రి అరకొర సిబ్బందితోనే నడుస్తోంది.

**నిత్యం వందలాది మంది..**

తూప్రాన్ ఆసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి నుంచి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారడంతో రోగుల సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ 450 వరకు ఓపీ రోగులు వస్తుండగా, గర్భిణులు 30 మంది వరకు పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రతి నెలా తూప్రాన్ ఆసుపత్రి ల్యాబ్‌లో 2600 మందికి, టీహబ్‌లో వెయ్యి వరకు పరీక్షలు జరుగుతున్నాయి. రోగుల సేవలు మెరుగ్గానే ఉన్నప్పటికీ, ఆసుపత్రిలో కీలకమైన గైనకాలజిస్ట్ పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మూడు ఉండగా, సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. గర్భిణుల పరీక్షల సమయాల్లో మాత్రమే ఆన్ కాల్ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. రాత్రి విధులు నిర్వహించాల్సిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రాత్రులలో సేవలు అందడం లేదు.

**తగ్గిపోతున్న ప్రసవాల సంఖ్య**

తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్‌ల సేవలు అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నెలకు సుమారు వంద ప్రసవాలు జరిగే ఆసుపత్రిలో ప్రస్తుతం ఈ సంఖ్య 30కి పడిపోయింది. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించే రోజుల్లోనే గైనకాలజిస్ట్‌లు గర్భిణులకు సేవలు అందిస్తున్నారు. ఆయా రోజుల్లోనే క్లిష్టమైన ప్రసవాలు, ఆపరేషన్ ప్రసవాలు చేస్తున్నారు. మిగతా రోజుల్లో ప్రసవాలు సరైన స్థాయిలో జరగడం లేదు. చిన్నపాటి సమస్య ఉన్నా సమీపంలోని ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. రాత్రులలో ప్రసవాలకు వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూప్రాన్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో రోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

**గైనకాలజిస్ట్‌లను నియమించాలి..**

తూప్రాన్ ఆసుపత్రిలో గర్భిణులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు గైనకాలజిస్ట్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు చేయకుండా రెఫర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తూప్రాన్ ఆసుపత్రిలోనే గర్భిణులకు ప్రసవాలు, సిజేరియన్లు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రసవాలు చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**నియామకానికి చర్యలు తీసుకోవాలి..**

పోస్టుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి అనుమతి లేదు. అంతేకాకుండా డ్యూటీలు చేసే వారు లభించడం లేదు. తూప్రాన్‌తో పాటు, నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో కూడా ఇబ్బంది ఉంది. కమిషనర్ కూడా నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు.

- శివదయాళ్, డీసీహెచ్ఎస్


ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

## రైతుల సంక్షేమానికి కేంద్రం కృషి

- ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం/హత్నూర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం జిన్నారం మండలం మాధారం వద్ద ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతులతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాని మోదీ రైతాంగ సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. దేశాన్ని ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాగా, రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయి వరకు కార్యకర్తలు తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ఆదెల్లి రవీందర్, ప్రతాప్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రాములు, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే హత్నూర మండలంలోని బోర్పట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఎంపీ రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు.

## అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ మత సెంటిమెంటుతో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ కార్మికుల పొట్టకొట్టే నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. మావోయిస్టుల పేరుతో ఆదివాసులను చంపుతున్నారని, లేబర్ కోడ్లను తీసుకువచ్చి పెట్టుబడిదారులు, కార్పొరేట్ పారిశ్రామికులను ప్రోత్సహిస్తోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలో ట్రిపుల్ ఆర్ పేరుతో ప్రభుత్వం తీసుకునే భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాములు, జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, మాణిక్యం, రాజయ్య, మల్లేశం, రాంచందర్, నర్సింహులు, సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

## పట్టుబట్టింది.. సాధించింది

- ఇంటర్ సప్లిమెంటరీలో స్టేట్ రెండో ర్యాంకు


రిషికారెడ్డి

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తన మీద తనకు ఎంతో నమ్మకంతో పట్టుబట్టి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసి స్టేట్ రెండవ ర్యాంకు సాధించింది ఎనుగంధ రిషికారెడ్డి. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని పొట్‌పల్లి గ్రామానికి చెందిన ఎనుగంధ వినూత, శ్రీనివాస్ రెడ్డిల కూతురైన రిషికా రెడ్డి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. మార్చిలో జరిగిన సాధారణ వార్షిక పరీక్షల్లో 470 మార్కులకు గానూ 463 మార్కులు సాధించింది. ఈ మార్కులతో సంతృప్తి చెందని రిషిక సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసింది. ఆమె నమ్మకం, కృషి ఫలించగా 470 మార్కులకు గానూ 468 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంకు సాధించింది. రిషికారెడ్డిని స్థానికులు అభినందించారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో చేరికకు దరఖాస్తుల స్వీకరణ

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో చేరేందుకు నేడు మండల వనరుల కేంద్రం తూప్రాన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తూప్రాన్ ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 19న తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్దగల తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2016 సెప్టెంబరు ఒకటి నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని, 4వ తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. చదువుతున్న ప్రస్తుత పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, పంచాయతీ, మున్సిపాలిటీ, తహసీల్దార్ నుంచి జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి మార్కుల మెమో, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

## బీసీ బిల్లు కోసం జూలై 17న రైల్ రోకో

- 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత


మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

మెదక్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధినేత్రి, కేసీఆర్ తనయ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రపతి వద్దనున్న బీసీ బిల్లు ఆమోదించాలని ఒత్తిడి పెంచేందుకు జూలై 17న రైల్ రోకో చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం బీసీ కుల సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన తరగతులపై ఇంకా అగ్రకుల దురహంకారం కొనసాగుతూనే ఉందని, అందుకు మెదక్‌లో బీసీ సంఘాల ప్రతినిధులచే నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావద్దని బెదిరింపులకు గురిచేయడమే నిదర్శనమన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి దశాబ్దాలు గడిచినా.. ఇప్పటికీ కనీసం వార్డు మెంబర్లు కూడా కాని బీసీ కులాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీల సంఖ్య తక్కువ చూపారని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కులగణన జాబితా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి తమ పాత్ర పూర్తయినట్లు భావిస్తోందని, సీఎం రేవంత్ తమ ఢిల్లీ పర్యటనల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించడం లేదని వాపోయారు. మెదక్ ఎంపీ రఘునందనరావు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మౌనం వహించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బీసీలు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి గళాలు విప్పాలని, తెలంగాణ రాష్ట్ర సాధన పాఠాలు వంటబట్టించుకున్న బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫూలే ఫ్రంట్ కన్వీనర్ శివశంకర్ మాట్లాడుతూ బీసీ వర్గాల సంఘటిత శక్తికి రాజకీయ పార్టీలకు మింగుడుపడడం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పాటు మిగతా జిల్లాల నుండి బీసీలు హాజరయ్యారు.

**దూరంగా బీఆర్ఎస్ శ్రేణులు..**

ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం దూరంగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశం దరిదాపులకు కూడా వెళ్లలేదు. ఎమ్మెల్సీ కవిత మాత్రం తన ప్రసంగంలో పలుమార్లు కేసీఆర్ ప్రస్తావన తెచ్చినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలు మాత్రం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనకపోవడంతో జాగృతి సమావేశాలకు వెళ్లవద్దని అంతర్గతంగా ఆదేశాలు వచ్చాయని పలువురు భావిస్తున్నారు.

## దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

- ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్‌రాజ్

సిద్దిపేట క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నాయకుడిపై పదునైన ఆయుధాలతో హత్యాయత్నం చేసిన రాజ్యాంగ వ్యతిరేక గూండాలను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి.రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం విద్యారంగ సమస్యలపై, దేశ సమస్యలపై, సామాజిక సమస్యలపై పోరాటం చేసే ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై రాజ్యాంగ వ్యతిరేక గూండాలు దాడి చేయడం బాధాకరం అన్నారు. కొన్ని దుష్ట శక్తులకు మొదటి నుంచి రాజ్యాంగం పైన, ప్రజాస్వామ్యం పైన నమ్మకం లేదన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య రాజ్యాంగ వ్యతిరేక శక్తుల చర్యలను ప్రశ్నించినందుకు ఆయనపై పదునైన ఆయుధాలతో హత్యాయత్నం చేయడం దారుణం అన్నారు. కార్యకర్తలకు ఏబీవీపీ రాష్ట్ర శాఖ అండగా ఉంటుందన్నారు. మంత్రి ఇలాకాలో ఇలా జరిగిన కూడా స్పందించకపోవడం సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, రాష్ట్ర కార్య సమితి సభ్యుడు వివేక్, రాష్ట్ర హాస్టల్ కో కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీంద్ర, నగర కార్యదర్శులు పర్శరామ్, చరణ్, రాజ్, రాకేష్, రాహుల్, వసంత, రాజేష్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలిత కుమారి

## 'అంగన్‌వాడీ కేంద్రాలతో శారీరక, మానసిక వికాసం'

కోహీర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలిత కుమారి అన్నారు. మంగళవారం కోహీర్ మండల కేంద్రంలోని లాలకుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో రెండున్నర సంవత్సరాలు వయస్సు దాటిన 9,937 మంది చిన్నారులను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందుతుందన్నారు. అంతేకాకుండా, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలలో బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ అంజమ్మ, సూపర్‌వైజర్ తులసి, సునీత, మేరీ గ్రేసీ, రాధ, సద్గుణ, పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్రా లీగ్ మ్యాచ్‌లో సంగారెడ్డి విజయం


విజయం సాధించిన సంగారెడ్డి జట్టు

సంగారెడ్డి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో మంగళవారం జరిగిన అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో సంగారెడ్డి జట్టు విజయం సాధించింది. సంగారెడ్డి రెడ్, సిద్దిపేట పింక్ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి రెడ్ జట్టు 49.5 ఓవర్లలో 229 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు 29 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ కావడంతో, సంగారెడ్డి రెడ్ జట్టు 106 పరుగుల తేడాతో విజయం సాధించిందని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

## సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు

- సంస్థ ఈడీ ఖుస్రోషాఖాన్


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఖుస్రోషాఖాన్

జహీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడాది కాలంగా కార్మికులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడం వల్లే సంస్థ లాభాలవైపు మళ్లిందని, ఇదే స్ఫూర్తితో పనిచేస్తే రెండేళ్లలో కార్మికుల కష్టాలు దూరమవుతాయన్నారు. జహీరాబాద్ డిపోకు కొత్త బస్సులు వచ్చేలా కృషిచేస్తామన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. ప్రయాణీకుల పట్ల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్' జవాన్‌కు సన్మానం


జవాన్‌కు సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శివ్వంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. మంగళవారం స్వగ్రామానికి రావడంతో ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. జడ్పీహెచ్ఎస్ అనంత పాఠశాలలో జవాన్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ ఉప సర్పంచ్ నవీన్, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# అర్హత టెన్త్.. ఉపాధి మస్త్..

- ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు)తో ఉద్యోగావకాశాలు
- కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ప్రారంభం
- అందుబాటులో ఆరు కోర్సులు.. ఉచిత అడ్మిషన్లు

**ఉచిత అడ్మిషన్లు**

కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో చేరడానికి విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలను సంప్రదిస్తే, సిబ్బంది ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అడ్మిషన్లు ఇస్తారు. కళాశాల బోధనా బృందం ఇప్పటికే గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంఈఓలను కలిసి విద్యార్థులను ఐటీఐలో చేర్పించేలా కృషి చేయాలని కోరింది. దీంతో పాటు వివిధ విద్యా సంస్థలు, సోషల్ మీడియా, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరుతోంది.




కుకునూరుపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం, భవిష్యత్తులో కేవలం హార్డ్‌వర్క్ కంటే స్మార్ట్ వర్క్ నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. డిగ్రీలు, పీజీలు అవసరం లేకుండానే పదవ తరగతి అర్హతతో అద్భుతమైన భవిష్యత్తును సొంతం చేసుకునే అవకాశాలను కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల అందిస్తోంది. టాటా కంపెనీ సౌజన్యంతో ఈ కళాశాలలో నూతనంగా ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు. అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో ఈ సంవత్సరం ఏటీసీలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులలో ప్రవేశాలకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు.

**భవిష్యత్తు అంతా ఏటీసీదే**

ప్రస్తుత కాలంలో మనిషి ప్రమేయం లేకుండానే వివిధ పరికరాలు, అధునాతన మిషన్లతో పనులు వేగంగా పూర్తవుతున్నాయి. పెయింటింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ నైపుణ్యం, కళాకృతుల తయారీ, ఎలక్ట్రిక్ వెహికిల్ బ్యాటరీ నైపుణ్యం, కంప్యూటర్ నియంత్రిత ఉత్పత్తి వంటి ఎన్నో నైపుణ్యాలను ఏటీసీ అందిస్తుంది. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులు తమ ప్రతిభను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి రంగాలలో స్థిరపడవచ్చు. భవిష్యత్తులో పనులు పూర్తిగా రోబోలు, పరికరాలతో జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు కాబట్టి, ఏటీసీ విభాగంలో ఏ కోర్సు పూర్తి చేసినా భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది.

ఆరు కోర్సులలో ఒక్కొక్క విభాగానికి 24 నుంచి 40 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడు కోర్సులు ఒక సంవత్సరంలో, మరో మూడు కోర్సులు రెండు సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు. కోర్సు పూర్తయిన తర్వాత జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలలో మంచి జీతాలతో ఉద్యోగాలు పొందవచ్చు లేదా సొంతంగా ఉపాధిని కూడా సృష్టించుకోవచ్చు. ఏటీసీ విభాగంలో విద్యార్థులకు బోధించడానికి ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు, ఆరుగురు ఇన్‌స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారు.

**కోర్సులివే..**

- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్
- మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేటిక్
- ఆర్టిఫిషియల్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్


విద్యార్థులకు రోబోటిక్ విద్య బోధిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

# ఫ్రెండ్లీ పోలీస్‌కు కేరాఫ్‌గా జిల్లా పోలీసులు


కుకునూర్‌పల్లి: మల్లన్నసాగర్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు


గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి



చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొబెషనరీ ఎస్ఐ సమత


మద్దూరు: స్థానిక ఎన్నికల నేపథ్యంలో తోర్నాలలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ మహబూబ్

కుకునూరుపల్లి/గజ్వేల్/చేర్యాల/ములుగు/కొమురవెల్లి/మద్దూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా రక్షణ, భద్రతకు సంబంధించి ప్రజలను చైతన్యపరిచేందుకు జిల్లాలోని పోలీసులు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేసి ఫ్రెండ్లీ పోలీసింగ్ స్ఫూర్తిని చాటిచెబుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం పలు మండలాల్లో సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, స్థానిక ఎన్నికల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు.

### ఈత సరదా కోసం ప్రాణాలు తీసుకోవద్దు

ఈత సరదా కోసం ప్రాణాలను తీసుకోవద్దని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీని ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు సరదా కోసం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి దిగవద్దని తెలిపారు. మల్లన్నసాగర్‌లో మొసళ్లు ఉన్నాయని, ఎవరూ చేపలు పట్టడం గానీ ఈత కొట్టడం కోసం రావద్దని తెలిపారు.

### రోడ్డు నిబంధనలు..

ట్రాఫిక్ పోలీసుల విధులపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల విధులను గూర్చి, రికార్డుల నమోదు, బ్రీత్ అనలైజర్, స్పీడ్ లేజర్ గన్, బాటమ్ స్టిక్, రిఫ్లెక్టర్ జాకెట్, ట్రాఫిక్ సిగ్నల్స్ ట్రాఫిక్ నియమ, నిబంధనల గూర్చి ఆయన అవగాహన కల్పించారు. వెంట ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

### మహిళా చట్టాలపై..

హుస్నాబాద్ షీ టీం సభ్యులు మంగళవారం చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌లో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొబెషనరీ ఎస్ఐ సమత, హుస్నాబాద్ షీటీం సభ్యులు మాట్లాడారు విద్యార్థి దశ ఎంతోకీలకమైందని, సక్రమమార్గంలో పయనిస్తే ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. మహిళల రక్షణకు పోలీసశాఖ అప్రమత్తతో వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాబోయే ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతారణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా చూడాలని పోలీస్ అధికారులు సూచించారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్న దృష్ట్యా మంగళవారం పలు గ్రామాలను పోలీసు అధికారులు సందర్శించి ఆయా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ములుగు మండలం కొత్తూరు గ్రామంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి గ్రామస్థులకు ఎస్ఐ రాజు, దూళిమిట్ట మండలంలోని తోర్నాలలో ప్రజలకు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయనీ వాటిని అడ్డం పెట్టుకొని గ్రామాల్లో గొడవలు పడొద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్థులు సహకరించాలని సూచించారు. పిల్లలు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తల్లితండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలనీ సూచించారు.

## పచ్చిగడ్డి మేస్తూ 13 మేకలకు అస్వస్థత.. మృతి

మర్కూక్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపర్తి గ్రామంలో సోమవారం సాయంత్రం 13 మేకలు మృత్యువాత పడ్డాయి. పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిని రవి తండ్రి రాములు నిరుపేద కుటుంబం కాగా, మేకలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సోమవారం సాయంత్రం పచ్చిగడ్డి మేస్తూ మేకలు అస్వస్థతకు గురై చనిపోయాయి. మృత్యువాత పడ్డ మేకలలో 10 మేకలు చిన్నబోయిని రవి, 3 మేకలు ఒగ్గు కొండయ్యవిగా గుర్తించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఘటనాస్థలానికి చేరుకుని మేకలను కాపాడే ప్రయత్నం చేశారు. సరైన సమయానికి పశు వైద్యాధికారి లేకపోవడంతో మేకలు మృతి చెందాయని, ఇప్పటికైనా ప్రభుత్వం పశు వైద్యాధికారిని నియమించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.మేకలు మృత్యువాత పడడంతో ఆ జీవాలపైన ఆధారపడి జీవించేవారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## మల్లంపల్లిలో తాటి చెట్ల నరికివేత


మల్లంపల్లిలో నరికివేసిన తాటి చెట్లు

అక్కన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లంపల్లి గ్రామంలో పట్టాదారులు తమ భూమిలోని తాటి చెట్లను నరికివేయడం పట్ల గీత కార్మికులు మంగళవారం ఆందోళ వ్యక్తం చేశారు. సదరు పట్టాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇటికాల చంద్రయ్య, ఇటికాల లక్ష్మయ్య అనే పట్టాదారుల వ్యవసాయ భూమి ఒడ్డుపై ఉన్న తాటిచెట్లను ఉద్ధేశపూర్వకంగానే నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెట్లకు కల్లు గీసుకొని తాము జీవనం సాగిస్తున్నామని, వాటిని నరికివేయడంతో ఉపాధి కోల్పోయామన్నారు. ఈ విషయమై ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. ఆందోళన వ్యక్తం చేసినవారిలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మార్క తిరుపతిగౌడ్, గీతకార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు బబ్బురు సదానందంగౌడ్, నాయకులు మాటూరి యాదయ్య గౌడ్, బబ్బురు కొంరయ్య గౌడ్, మాటూరి రాముగౌడ్ తదితరులు ఉన్నారు.

## న్యూస్ బాక్స్

### 19న స్పోర్ట్స్ స్కూల్ మండలస్థాయి ఎంపికలు

సిద్దిపేట రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతి బాల బాలికలకు ప్రవేశం కోసం ఈ నెల 19న సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం ఎంపికలు నిర్వహించనున్నట్టు మండల విద్యాధికారి కొత్త రాజిరెడ్డి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు 9440478436 పీడీ ఆశోక్‌ను సంప్రదించాలన్నారు.

### దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సిద్దిపేట అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను భవన నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు.

### రైతు భరోసాకు రెండు రోజులే గడువు

కుకునూరుపల్లి/రాయపోల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులే గడువు ఉన్నట్టు ఆయా మండల వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు రైతుభరోసా పథకం కోసం ఈ నెల 20లోపు సంబంధిత ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునేవారు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డుతో వ్యవసాయ విస్తరణ అధికారిని అధికారులను సంప్రదించాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇదివరకే రైతుభరోసా వస్తున్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

### ప్రైవేట్ పాఠశాలల దందాపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు, బెల్టులు, డ్రెస్సులలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మోసం చేస్తున్న హుస్నాబాద్ పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఎంఈవో మనీలకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రెండో తరగతి చదువుకునే విద్యార్థికి పుస్తకాల పేరిట రూ. 5 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అయా పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలను వివిధ బుక్ సెంటర్లలో నిలువ చేశారన్నారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎస్పీ నాయకులు శంకర్, సాంబరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

### విద్యార్థుల అభ్యున్నతికి రిలయబుల్ ట్రస్ట్ కృషి

కుకునూరుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రిలయబుల్ ట్రస్ట్ పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న సేవలు వెలకట్టలేమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ వి. ఆనంద్ తెలిపారు. మంగళవారం ఎల్లయ్యగూడ శివారులో విజయలక్ష్మి మెమోరియల్ స్టోన్ బ్రిడ్జి పాఠశాలకు రిలయబుల్ ట్రస్ట్ రూ. 6లక్షల విలువ చేసే స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నిత్యావసర సరుకులు, నోట్‌బుక్స్, క్రీడా సామగ్రి, ఫర్నీచర్ తదితర వస్తువులను ట్రస్ట్ డైరెక్టర్ తుపాకుల రవి ఆధ్వర్యంలో పాఠశాలకు అందజేశారు.



## అంగన్‌వాడీలతో చిన్నారుల్లో సృజనాత్మకత పెంపు


సిద్దిపేట అర్బన్: పొన్నాల అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో శారద, ఉపాధ్యాయులు

సిద్దిపేట అర్బన్/దుబ్బాక/మిరుదొడ్డి/జగదేవ్‌పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం పలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట సీడీపీవో శారద మాట్లాడుతూ.. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, లావణ్య, లత, విజయ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలంలోని అందే అంగన్‌వాడీ సెంటర్-2లో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే కొండాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు అర్చన తదితరులున్నారు. జగదేవ్‌పూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-4లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు వారి తల్లిదండ్రులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోష, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షకీరా తదితరులున్నారు.

## స్వచ్ఛ హుస్నాబాద్‌లో వ్యాపారులు భాగస్వాములు కావాలి


వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ హుస్నాబాద్‌లో పట్టణంలోని వ్యాపారులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ టి మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశమయ్యారు. వాణిజ్య, వ్యాపార దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని, చెత్తను వేరు చేసి పురపాలక సంఘం వాహనానికి అందించాలన్నారు. ప్రతీ వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. చికెన్, మటన్ వ్యర్థాలను సాయంత్రం వచ్చే మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలన్నారు. ప్రజలు మార్కెట్‌కు జ్యూట్ బ్యాగులు తీసుకెళ్లాలన్నారు. అనంతరం పట్టణంలోని పబ్లిక్ టాయ్‌లెట్లను పరిశీలించి 14వ వార్డులో చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు రాజయ్య, కిరాణా సంఘం అధ్యక్షులు బెజుగం బాలకిష్టయ్య, వడ్డెపల్లి బాలయ్య, తనకు అంజనేయులు, మేనేజర్ సంపత్ రావు, రవికుమార్ తదితరులున్నారు.

### పారిశుధ్యంతో సంపూర్ణఆరోగ్యం

**చేర్యాల:** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని, లేదా వ్యాధుల బారిన పడే ప్రమాదముందని మునిసిపల్ మేనేజర్ ప్రభాకర్ అన్నారు. వందరోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేర్యాల మునిసిపల్ ఆధ్వర్యంలో పలు వార్డులలో తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడం, పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపు


కొండపాకలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కొండపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత ఏకాగ్రత లభిస్తుందని యోగా శిక్షకురాలు తోట సంధ్య, కొండపాక బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొండపాక బాలికల ఉన్నత పాఠశాల, వ్యాస మహర్షి యోగా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో యోగ శిక్షణా శిబిరాన్ని మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో ఏకాగ్రత పెంపొందించి చదువు పట్ల ఆసక్తి కనబరిచే విధంగా చేస్తుందన్నారు. యోగా నేర్చుకుని ప్రతినిత్యం సాధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. ఈ నెల 21న ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని యోగ సాధన చేశారు.

● **మిరుదొడ్డి:** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని యునాని ఆసుపత్రి వైద్యురాలు నసీం మున్నిసా అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం అల్వాల చెప్యాల చౌరస్తాలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో యోగ, పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా యోగ శిక్షకురాలు స్వప్న తో యోగాసనాలను వేయించారు.

## టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గజ్వేల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దామని గజ్వేల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని అహ్మదీపూర్ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఇంపాక్ట్ ప్రాజెక్టు టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో టీబీ నిర్మూలన విజయవంతం అయిన వారితో టీబీ ఛాంపియన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో టీబీని గుర్తించినట్లయితే టీబీ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని, మందులు సక్రమంగా వాడి అరికట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా టీబీ చికిత్స విజయవంతం అయినవారిని అభినందించారు. టీబీ వచ్చిన వారిలో బరువు తగ్గడం, దగ్గుతో తెమడ రావడం, జ్వరం రావడం, ఒళ్లు నొప్పులు, ఆకలి మందగించడం గుర్తించి తెమడ పరీక్ష చేయించుకుని టీబీ వ్యాధి మందులు ఆరు నెలలు సక్రమంగా వాడితే టీబీని అరికట్టవచ్చని తెలిపారు. సిద్దిపేటను టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీబీ అలర్ట్ ఇండియా డీఎల్ ప్రేమ్‌కుమార్, గజ్వేల్ మెడికల్ ఆఫీసర్లు ప్రణయ్‌కుమార్, బల్బీర్‌సింగ్, రాజశేఖర్, మహారాజ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


అహ్మదీపూర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

## రైతుకేది 'సహకారం'!

(5వ పేజీ తరువాయి)

ఈసారి దుక్కులు మొదలైనా కూడా సొసైటీలు ఇప్పటికీ వరకు యూరియా అందిస్తాయా..?లేవా..? అనే సందేహం రైతుల్లో నెలకొన్నది.

### పెట్టుబడికి అవస్థలు

వర్షాకాలంలో పంట పెట్టుబడులకు రైతులు అవస్థలు పడుతున్నారు. పొలం దున్నడానికి ట్రాక్టర్‌కు రూ.1500, అలాగే విత్తనాలకు. యూరియాకు, ఎరువులకు కలిపి, సుమారు 17వేలు ఖర్చవుతుంది. రైతులకు సహకార సంఘాల్లో రుణాలు అందకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్‌ల ద్వారా అప్పులు చేసి సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి భారంగా మారింది.

## నకిలీ డాక్టర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి


గజ్వేల్‌లోని నకిలీ వైద్యశాల వద్ద మాట్లాడుతున్న వైద్యులు

గజ్వేల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో నకిలీ డాక్టర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఐఎంఏ నాయకులు డాక్టర్ ఏలిశాల లింగం పిలుపునిచ్చారు. గజ్వేల్ ఐఎంఏ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు క్లినిక్‌లను ఐఎంఏ బృందంతో కలసి మంగళవారం రాత్రి సందర్శించారు. ఇటీవల గజ్వేల్ పట్టణంలో విచ్చలవిడిగా ఆసుపత్రులు వెలుస్తున్నాయని, క్వాలిఫైడ్ డాక్టర్స్ కాని వారు సైతం ఆసుపత్రులను ఏర్పాటు చేసి వైద్యాన్ని చేయడంతో అమాయక ప్రజలు ఆగమవుతున్నారన్నారు. ప్రజలు విచారణ చేసుకుని వైద్యానికి వెళ్లాలని సూచించారు. ఇప్పటికే గజ్వేల్ కంటి ఆసుపత్రితో పాటు మరో ఆక్సీకేర్ ఆసుపత్రిలో క్వాలిఫైడ్ డాక్టర్లు లేరని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. వెంట వైద్యులు డాక్టర్ పెంటాచారీ, డాక్టర్ చంద్రారెడ్డి, సుజాత తదితరులున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

తొగుట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొగుటలో రైతు భరోసా నిధులను ప్రభుత్వం రైతుల అకౌంట్‌లలో జమచేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. అంతకు ముందు స్థానిక రైతు వేదికలో ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డిని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

దుబ్బాక, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం దుబ్బాకలో బీజేపీ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ ప్రధానకార్యదర్శులుగా నరేష్, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా యాదవరెడ్డి, సంపత్, నవ్యరెడ్డి, కనకరాజు, కార్యదర్శులుగా భరత్‌చారి, మహిపాల్‌రాజేందర్, నాగరాజు, కోశాధికారి సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి


జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

ములుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పంటల్లో సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు హార్టికల్చర్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలవారీగా ఉద్యాన పరిశోధన ప్రణాళికలు సిద్ధం చేయాలని, 10 సంవత్సరాలలో రాష్ట్ర అవసరాలను తీర్చేలా ప్రణాళికలు ఉండాలని ఆయన తెలిపారు. ఉద్యాన పంటల విస్తీర్ణం 20 లక్షల ఎకరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఐపీ రెడ్డి, ఎం. మనోహర్‌రావు, డాక్టర్ ఉమాదేవి, చీనానాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, రాజశేఖర్, ఎన్ శ్రీనివాసన్, విజయ, జోనల్ హెడ్స్, సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ షాలెం రాజుపై గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

గజ్వేల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ షాలేం రాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంతోషి సేవా పరిషత్, హైందవ సంఘాల నాయకులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేటలో పాస్టర్ షాలెం రాజు మాట్లాడిన మాటల వీడియో, ఫొటోలతో కూడిన ఆధారాలను పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలోని గుంటూరు జిల్లా చిలకలూరిపేట చర్చి పాస్టర్ షాలెం రాజు మీద వెంటనే చర్యలు తీసుకోవాలని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి అనరాని మాటలు అన్నారని మండిపడ్డారు. స్త్రీల మనోభావాలను దెబ్బతీశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళలను కించపరుస్తూ, అసభ్యకరంగా మాట్లాడిన పాస్టర్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## 21న మెగా ఫార్మా జాబ్‌మేళా

సిద్దిపేట కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరిగే మెగా ఫార్మా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డా. జె ఉమామహేశ్వరి సూచించారు. తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం మెగా ఫార్మా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, అరబిందో ఫార్మా బయోకాన్, భారత్ బయోటెక్, హెటిరో ల్యాబ్స్, బయోలాజికల్ ఈ లిమిటెడ్‌తో పాటు పలు సంస్థలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం పూర్తయిన 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు శనివారం జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ జీడిమెట్లలోని టీడీఎంఏఐ శిక్షణ కేంద్రంలో ఉచిత వసతితో పాటు ఉచితంగా ఫార్మా శిక్షణ, కంప్యూటర్, ఆంగ్లభాషా, జీవన నైపుణ్యాల గురించి శిక్షణ అందిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం రూ. 15 వేల నుంచి 25 వేల వేతనంతో గ్యారంటీగా ఉద్యోగ అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఈ సదావకాశాన్ని సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల అభ్యర్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సిద్దిపేట రూరల్/కొమురవెల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో భూ భారతి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్డీవో సదానందం, నారాయణరావుపేట ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అదేవిధంగా కొమురవెల్లి మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో సదానందం పరిశీలించారు. కొమురవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని, మండల వ్యాప్తంగా మొత్తం 986 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జి.దివ్య తెలిపారు. నేటితో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సిద్దిపేట రూరల్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశం, ఆర్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్ రెడ్డి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

గజ్వేల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని 1వ వార్డులో మొక్కలను నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ... మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించి కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కాంగ్రెస్ మంత్రులు కేవలం పర్యటనలకే పరిమితమయ్యారని, సమస్యల, పెండింగ్ పనులను పూర్తి చేయించేందుకు చొరవ చూపడం లేదన్నారు. ఆయన వెంట బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయకులు ఉన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప సభ కరపత్రాల ఆవిష్కరణ

కొమురవెల్లి,జూన్17(ఆంధ్రజ్యోతి): మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం 11ఏళ్ల పాలన వికసిత్ భారత్ సంకల్ప సభ కరపత్రాలను మంగళవారం బీజేపీ నాయకులు కొమురవెల్లి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి తోకల ఉమారాణి, మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే దేశ ప్రజలకు రక్షణ, సుస్థిరత ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు, చేర్యాల పట్టణాధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల పట్టణంతో పాటు శబాషీగూడెం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప సభలు వేర్వేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కల్నర్ భిక్షపతి, అంకుగారి శశిధర్‌రెడ్డి, బూరుగు సురేశ్, తోకల ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఈసెట్ కౌన్సెలింగ్

నంగునూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ లో ఈసెట్ - 2025 ప్రవేశాల కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ గోవర్ధన్ తెలిపారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ మ్యాథ్స్ చదివిన విద్యార్థులు ఇంజనీరింగ్ ఈసెట్ -2025 లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌ను ఈ నెల 17 నుంచి 19 వరకు ఉంటుందన్నారు.

## బెక్కల్‌లో వైద్యశిబిరం

మద్దూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : దూళిమిట్ట మండలంలోని బెక్కల్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహించి బీపీ. డయాబెటీస్ ఉన్నవారిని గుర్తించినట్లు పల్లె దవాఖానా వైద్యాధికారి స్టువర్ట్‌సన్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని లద్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రెఫర్ చేసినట్లు తెలిపారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.